
సాక్షి
కామారెడ్డి
శనివారం । 28 । అక్టోబర్ । 2023



శ్రీనివాసుల అడ్డా..
బాన్సువాడ నియోజకవర్గానికి 16 సార్లు ఎన్నికలు జరగ్గా.. శ్రీనివాస్ అనే పేరున్నవారే పదిసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.
- 10లో ▸



అందరి సహకారంతో..
బాన్సువాడ ఎంసీహెచ్‌లో పనిచేస్తున్న అందరి సహకారం వల్లే అవార్డులు వస్తున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ పేర్కొన్నారు.
- 11లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.6 /14.5
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

‘మరోసారి అవకాశం ఇవ్వండి’



మద్నూర్: మరోసారి అవకాశం ఇస్తే మరింత సేవ చేస్తానని జుక్కల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే పేర్కొన్నారు. డోంగ్లీ మండలంలోని మదన్‌హిప్పర్గా, ఇలేగావ్, చిన్న టాక్లీ, పెద్ద టాక్లీ, లింబుర్‌లలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఇతర పార్టీల నాయకులు వచ్చి బురిడీ కొట్టించి అయోమయానికి గురిచేస్తారని, అలాంటి వాళ్ల మాటలు నమ్మకుండా బీఆర్‌ఎస్‌కే ఓటు వేయాలని కోరారు. అనంతరం ఇలేగావ్‌లోని దర్గాలో సింధే ప్రార్థనలు చేశారు. ఆయన వెంట ఎంపీపీ లక్ష్మీబాయి, బీఆర్‌ఎస్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు ఉన్నారు.

సరిహద్దుల్లో నిఘా కట్టుదిట్టం




మద్నూర్: ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. అక్రమంగా మద్యం, డబ్బు తరలించకుండా చర్యలు తీసుకుంటున్నారు. మద్నూర్ మండలం మహారాష్ట్రకు సరిహద్దులో ఉండడంతో శుక్రవారం మండలంలోని సలాబత్‌పూర్ వద్ద రెవెన్యూ అధికారులు, ఎక్సైజ్, బీఎస్‌ఎఫ్ జవాన్లు, పోలీసు సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మద్నూర్ ఎస్సై కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు కాంగ్రెస్‌లోకి ఆకుల లలిత

ఖలీల్‌వాడి: కాంగ్రెస్ పార్టీలో చేరడానికి మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత దంపతులు చేసిన ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే రాజ్‌గోపాల్‌రెడ్డితో కలిసి ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జునఖర్గే సమక్షంలో పార్టీలో చేరారు. 2018 శాసనసభ ఎన్నికలలో ఆమెకు ఆర్మూర్ టికెట్టును కాంగ్రెస్ పార్టీ కేటాయించింది. అయితే పోలింగ్‌కు మూడు రోజుల ముందు నుంచి ఆమె ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఎన్నికల అనంతరం సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం ఆశించినప్పటికీ అవకాశం దక్కలేదు. రాష్ట్ర మహిళ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి దక్కింది. తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ఈనెల 16న బీఆర్‌ఎస్ తోపాటు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవికి లలిత రాజీనామా చేశారు. ఆమె చేరికను స్థానిక కాంగ్రెస్ నేతలు వ్యతిరేకించారు. దీంతో పెద్దపల్లిలో విజయభేరి బస్సుయాత్ర సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసేందుకు వెళ్లిన ఆకుల లలిత దంపతులు వెనుతిరగాల్సి వచ్చింది. చివరికి కాంగ్రెస్ కేంద్ర స్క్రీనింగ్ కమిటీ రాష్ట్రస్థాయి నేత సహకారంతో ఆమె కాంగ్రెస్‌తో చేరారు.

రంగు మారుతోంది!

- పార్టీలు మారుతున్న నేతలు
- ఎల్లారెడ్డిలో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు చెరో పార్టీలోకి...
- కామారెడ్డి కాషాయ నేతలకు గాలం వేస్తున్న గులాబీ పార్టీ
- రేపు కేడర్‌తో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సమావేశం
- బాన్సువాడ బీజేపీ నేత కాంగ్రెస్‌లో చేరిక లాంఛనమే!



జిల్లాలో ఎన్నికల వేడి రాజుకుంటోంది. రాజకీయం రంగులు మారుతోంది. దీంతో ఏ నేత ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంటోంది. ఎల్లారెడ్డికి చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు ఇప్పటికే కండువాలు మార్చారు. బాన్సువాడ బీజేపీ నేత కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమైంది. మరోవైపు కాంగ్రెస్ టికెట్టుపై ఆశలు సన్నగిల్లిన జుక్కల్ మాజీ ఎమ్మెల్యే.. భవిష్యత్ కార్యాచరణ కోసం అనుచరులతో సమావేశమవుతున్నారు. కామారెడ్డిలో బీజేపీని దెబ్బతీసేందుకు ఆ పార్టీకి చెందిన పలువురితో గులాబీ నేతలు మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

సాక్షి, కామారెడ్డి: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే రాజకీయాలు వేడెక్కాయి. ప్రత్యర్థుల బలాన్ని తగ్గించేందుకు ఆయా పార్టీల నేతలపై ప్రధాన పార్టీలు వల విసురుతున్నాయి. దీంతో పలువురు నేతలు పార్టీలు మారుతున్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆయనకు బాన్సువాడ టికెట్టు లభించే అవకాశాలున్నాయి.

రవీందర్‌రెడ్డి 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్లారెడ్డినుంచి టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 2008 ఉప ఎన్నికలలో ఓటమి పాలైనా.. 2009, 2014 సాధారణ ఎన్నికల్లో విజయం సాధించారు. 2018 లో ఓడిపోయారు. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన జాజాల సురేందర్.. తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో నియోజకవర్గంలో గులాబీ నేతలు రెండు గ్రూపులుగా విడిపోయారు. అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకే నియోజకవర్గ బాధ్యతలు అప్పగించడంతో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ఇబ్బంది పడ్డారు. తాను ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించడంతోపాటు ఉమ్మడి జిల్లాలో పార్టీ ఎదుగుదలకు చేసిన కృషిని కూడా అధిష్టానం విస్మరించిందని ఆవేదనకు గురైన రవీందర్‌రెడ్డి.. బీఆర్‌ఎస్‌ను వీడి ఈటల రాజేందర్‌తో కలిసి బీజేపీలో చేరారు. ఆ పార్టీలో కొంతకాలం క్రియాశీలకంగా ఉండి రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలతో సన్నిహిత సంబంధాలు నెరిపినా.. ఆయన ఎక్కువ కాలం బీజేపీలో ఇమడలేకపోయారు. కాంగ్రెస్ పార్టీలో చేరాలని భావించి ఆ పార్టీ నేతలతో సంప్రదించారు. ఎల్లారెడ్డి టికెట్టు ఆశించినా.. సాధ్యం కాకపోవడంతో ప్రత్యామ్నాయంగా బాన్సువాడ నుంచి పోటీ చేయాలని రాష్ట్ర నాయకత్వం సూచించడంతో అక్కడికి వెళ్లేందుకు రెడీ అయ్యారు. గురువారం రాత్రి ఢిల్లీలో ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరగా.. మరో మాజీ ఎమ్మెల్యే బి.జనార్దన్‌గౌడ్ కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం మంత్రి కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఆయన 2008 లో జరిగిన ఉప ఎన్నికల్లో దివంగత సీఎం వైఎస్సార్ ప్రోత్సాహంతో కాంగ్రెస్ అభ్యర్థిగా ఎల్లారెడ్డి నుంచి పోటీ చేసి గెలిచారు. కొద్ది కాలమే ఎమ్మెల్యేగా కొనసాగినప్పటికీ దివంగత సీఎం వైఎస్సార్ సహకారంతో మోడల్ డిగ్రీ కాలేజీ సాధించారు. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలతో బీఆర్‌ఎస్‌లో చేరిన జనార్దన్‌గౌడ్‌కు నామినేటెడ్ పదవులు దక్కలేదు. దీంతో తిరిగి కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. తాజాగా ఆయన మరోసారి గులాబీ గూటికి చేరారు.

మరో మాజీ ఎమ్మెల్యే..

జుక్కల్ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్టుపై ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల ప్రచారాన్నీ ప్రారంభించారు. అయితే పార్టీలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో టికెట్టుపై ఆశలు సన్నగిల్లడంతో భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకోవడానికి ఆదివారం తన అనుచరులతో సమావేశమవ్వాలని నిర్ణయించారు. ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారన్న దానిపై కాంగ్రెస్‌లో చర్చ జరుగుతోంది.

కాంగ్రెస్‌లోకి..

బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నేత మల్యాద్రిరెడ్డి కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమైంది. ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి హస్తినలో మకాం వేసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. కాగా కామారెడ్డి నియోజకవర్గంలో బీజేపీని దెబ్బతీసేందుకు కొందరు కాషాయ నేతలకు గులాబీ పార్టీ గాలం వేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ అభ్యర్థి వెంకటరమణారెడ్డితో మొదటి నుంచి దూరంగా ఉంటూ వస్తున్న పలువురితో టీఆర్‌ఎస్ నేతలు సంప్రదింపులు జరిపారన్న ప్రచారం జరుగుతోంది.



మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్



కాంగ్రెస్ గూటికి చేరిన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి

‘పకడ్బందీగా విధులు నిర్వర్తించాలి’



నోడల్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: జిల్లాలో శాసనసభ ఎన్నికలను సజావుగా నిర్వహించడం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల విధులు, బాధ్యతలపై నోడల్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ప్రవర్తనా నియమావళి అమలు, వ్యయ నిర్వహణ కమిటీల పాత్ర ప్రధానమైనవన్నారు. ఆయా బృందాలు సమన్వయంతో పనిచేసినప్పుడే మిగతా ఎన్నికల ప్రక్రియ సజావుగా నడుస్తుందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, సి-విజిల్ యాప్, సువిధ, ఎంసీసీ, వ్యయ నిర్వహణ కమిటీ, ఎంసీఎంసీ కమిటీల పనితీరుపై ఆరా తీశారు. శని, సోమవారం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనీల ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, నోడల్ అధికారులు కిషన్, సింహారావు, సురేందర్ కుమార్, రాజు, బావయ్య, శ్రీనివాస్, శాంతి కుమార్, ప్రవీణ్ కుమార్, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రింటింగ్ ప్రెస్‌లు నిబంధనలు పాటించాలి..

జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు రాజకీయ పార్టీల ప్రచార సామగ్రి ముద్రణ విషయంలో నిబంధనలు పాటించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. అనుమతి పొందిన వాటిని మాత్రమే ముద్రించాలని స్పష్టం చేశారు. పార్టీలు తమ ప్రచురణలకు సంబంధించిన నమూనాలను ఎంసీఎంసీ కమిటీకి ముందుగా సమర్పించాలని సూచించారు. వాటిని ఎంసీఎంసీ కమిటీ పరిశీలించి 24 గంటలలోగా అనుమతించడం గాని, తిరస్కరించడం గాని చేస్తుందని తెలిపారు. ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ప్రచురించే ప్రచార సామగ్రిపై ప్రింటింగ్ ప్రెస్ పేరు, చిరునామా, సెల్ నంబర్, ప్రచురణల సంఖ్య, ప్రచురించే అభ్యర్థి పేరు, చిరునామా వివరాలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. నిర్దేశించిన సంఖ్యకు మించి ముద్రించినా, నిబంధనలు పాటించకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అటవీ భూముల పరిశీలన



తాండూర్‌శివారులో నిలిచిపోయిన రోడ్డు పనులను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

నాగిరెడ్డిపేట: మండలంలోని ధర్మారెడ్డి నుంచి మెదక్ జిల్లా ముగ్ధపూర్ వరకు చేపట్టిన రోడ్డుపనులు కొనసాగే అటవీ భూములను శుక్రవారం సెంట్రల్ ఐఎఫ్‌ఎస్ అధికారి కైలాస్ భీంరావు, ఇన్‌చార్జి డీఎఫ్‌వో వికాస్ జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి పరిశీలించారు. ధర్మారెడ్డి–ముగ్ధపూర్ రోడ్డు కోసం 2017లో నిధులు మంజూరవడంతో పనులను ప్రారంభించారు. కాగా నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ శివారులో సుమారు 1.5 కిలోమీటర్ల అటవీభూమి గుండా రోడ్డు వేయాల్సి ఉంది. అటవీశాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ క్రమంలో రోడ్డు వేసే అటవీ ప్రాంతాన్ని శుక్రవారం ఫారెస్ట్ ఉన్నతాధికారులు పరిశీలించారు. రోడ్డు ఏర్పాటులో భాగంగా కోల్పోయే అటవీ ప్రాంతం వివరాలను తెలుసుకున్నారు. రోడ్డు పనులు ఆగడంతో కామారెడ్డి –మెదక్ జిల్లాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, నాయకులు సంజీవులు, సంగయ్య, కిష్టయ్య అధికారులకు వివరించారు. వారివెంట ఎఫ్‌డీవో గోపాల్‌రావు, ఆర్‌అండ్‌బీ ఈఈ రవిశంకర్, డీఈఈ మోహన్, ఏఈ శ్రీకాంత్, నాగిరెడ్డిపేట ఎఫ్ఆర్‌వో వాసుదేవ్, డీఎఫ్ఆర్‌వో రవికుమార్ తదితరులు ఉన్నారు.

‘కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయం’

కామారెడ్డి క్రైం: కేసీఆర్ ముఖ్యమంత్రిగా హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. శుక్రవారం భిక్కనూరు మండలం కాచాపూర్, రామారెడ్డి మండలం రెడ్డిపేట్, కామారెడ్డి బల్దియా పరిధిలోని వడ్లూర్, టేక్రియాల్ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గంప మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పనిచేసి సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిర్మల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ గంప

సీఎం రాకతో ఉమ్మడి జిల్లాకు మేలు

- రెడ్డి ఐక్య వేదిక నాయకులతో ఎమ్మెల్సీ కవిత

సాక్షి, కామారెడ్డి: ముఖ్యమంత్రి కేసీఆర్ కామారెడ్డి నియోజకవర్గంలో విజయం సాధిస్తే ఉమ్మడి జిల్లాకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లాకు చెందిన రెడ్డి ఐక్యవేదిక నాయకులు హైదరాబాద్‌లో కవితతో సమావేశమై సీఎం కేసీఆర్ అభ్యర్థిత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండడతో కార్యకర్తల్లో ఉత్సాహం వచ్చిందని, తమ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్న సంతోషంతో ఉన్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ విజయం సాధించడం ద్వారా కామారెడ్డి జిల్లాతో పాటు నిజామాబాద్ జిల్లా కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. సీఎంను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అగ్రవర్ణ పేదలకోసం నియోజకవర్గానికి ఒక గురుకుల పాఠశాల ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చడంపై రెడ్డి ఐక్యవేదిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి, కామారెడ్డిలోని ఆర్‌బీవీఆర్ఆర్ ట్రస్టు చైర్మన్ నాగర్తి చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి, నాయకులు గంగారెడ్డి, రమేశ్‌రెడ్డి, రాంరెడ్డి, మల్లారెడ్డి, భీమ్‌రెడ్డి, నర్సారెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి, ఏలేటి రాంరెడ్డి, వెల్మ మల్లారెడ్డి, నవీన్‌రెడ్డి, నర్సారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రెడ్డి ఐక్య వేదిక ప్రతినిధులతో ఎమ్మెల్సీ కవిత

మదన్‌మోహన్ ‘చేతి’కి ఎల్లారెడ్డి టికెట్టు

- కామారెడ్డి స్థానంపై వీడని సస్పెన్స్
- పెండింగ్‌లోనే బాన్సువాడ, జుక్కల్ అభ్యర్థిత్వాలు
- కాంగ్రెస్ శ్రేణుల్లో అయోమయం

సాక్షి, కామారెడ్డి: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల రెండో జాబితాను శుక్రవారం విడుదల చేసింది. తొలి జాబితాలో జిల్లాలోని ఒక్క స్థానానికీ అభ్యర్థిని ఖరారు చేయని పార్టీ.. రెండో జాబితాలో ఒక్క నియోజకవర్గంలోనే అభ్యర్థిత్వాన్ని తేల్చింది. ఎల్లారెడ్డి అభ్యర్థిగా మదన్‌మోహన్‌రావు పేరును ప్రకటించింది. కామారెడ్డి స్థానంపై సస్పెన్స్ కొనసాగుతుండగా.. జుక్కల్, బాన్సువాడ అభ్యర్థిత్వాలూ పెండింగ్‌లోనే ఉన్నాయి.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ టికెట్టు కోసం పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రావుతో పాటు సుభాష్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నించారు. అయితే మదన్‌మోహన్‌రావుకే టికెట్టు దక్కింది. ఆయన 2019 ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉండడంతో ఎలాగైనా ఇక్కడినుంచి పోటీ చేయాలన్న పట్టుదలతో నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో సన్నిహిత సంబంధాలు పెట్టుకున్న మదన్‌మోహన్‌రావు ఎప్పటికప్పుడు నియోజకవర్గంలో తిరుగుతూ ప్రజల్లో పట్టు సంపాదించారు. ఆయన రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సొంత అల్లుడు.

నైరాశ్యంలో సుభాష్‌రెడ్డి వర్గం

ఎల్లారెడ్డి టికెట్టు తనకే వస్తుందని సుభాష్‌రెడ్డి ఇన్నాళ్లూ గట్టి నమ్మకంతో ఉన్నారు. మదన్‌మోహన్‌రావు అభ్యర్థిత్వం ఖరారు కావడంతో సుభాష్‌రెడ్డితోపాటు ఆయన అనుచరులు తీవ్ర నిరాశకు గురయ్యారు. నియోజకవర్గంలో బలమైన క్యాడర్‌ను కలిగి ఉండడంతో పాటు అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టిన సుభాష్‌రెడ్డి.. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడన్న పేరుంది. ఆయన మద్దతుతో టికెట్టు సాధిస్తానన్న ధీమాతో ఏళ్ల తరబడిగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ వస్తున్నారు. చివరకు టికెట్టు రాకపోవడంతో ఆయన నిరాశకు గురయ్యారు. 2018 ఎన్నికల్లోనూ టికెట్టు వచ్చినట్టే వచ్చి చేజారింది. వచ్చే ఎన్నికల్లో అవకాశం ఇస్తామన్న అప్పట్లో పార్టీ రాష్ట్ర నాయకత్వం భరోసా ఇచ్చింది. ఈసారి కూడా మొండి‘చేయి’ చూపించడాన్ని ఆయన వర్గం జీర్ణించుకోలేకపోతోంది. రెబల్‌గా బరిలోకి దిగాలని ఆయనపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

మరో రెండు రోజులు ఆగాల్సిందే..

జిల్లాలోని మరో మూడు అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించలేదు. సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న కామారెడ్డి నియోజకవర్గం అత్యంత కీలకమైనది కావడంతో ఇక్కడినుంచి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని బరిలో నిలపాలని కాంగ్రెస్ అధిష్టానం యోచిస్తున్నట్లు వార్తలొచ్చాయి. ఇక్కడ టికెట్టు రేసులో ఉన్న మాజీ మంత్రి షబ్బీర్ అలీని నిజామాబాద్ అర్బన్‌కు పంపుతారన్న ప్రచారం జరిగింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు సామాజిక మాధ్యమాల్లో ఓ జాబితా చక్కర్లు కొట్టింది. అందులో కామారెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి పేరు, నిజామాబాద్ అర్బన్‌నుంచి షబ్బీర్ అలీ పేరు ఉండడం హాట్ టాపిక్‌గా మారింది. అయితే పార్టీ విడుదల చేసిన రెండో జాబితాలో ఎల్లారెడ్డి స్థానం ఒక్కటే ఉండడంతో మళ్లీ అదే సస్పెన్స్ కొనసాగుతోంది. బాన్సువాడ, జుక్కల్ నియోజక వర్గాలను కూడా పెండింగ్‌లో పెట్టారు. కాగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నాన్చుడు ధోరణితో పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్నప్పటికీ పార్టీ అభ్యర్థులను ప్రకటించడంతో జాప్యం కొనసాగిస్తుండడంతో అసహనం వ్యక్తమవుతోంది. శనివారం చంద్ర గ్రహణం ఉండడంతో మూడో జాబితా విడుదల చేసే అవకాశాలు లేవని భావిస్తున్నారు. దీంతో అభ్యర్థుల ప్రకటన కోసం మరో రెండు రోజులు ఆగాల్సిందేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఎల్లారెడ్డిలో టపాకాయలు కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ రూరల్ అభ్యర్థిగా..

నిజామాబాద్ రూరల్ అభ్యర్థిగా రేకులపల్లి భూపతిరెడ్డిని ప్రకటించారు. ఈ స్థానాన్ని కాటిపల్లి నగేష్‌రెడ్డి ఆశించి, చివరి వరకు ప్రయత్నాలు చేశారు. కానీ పార్టీ భూపతిరెడ్డివైపే మొగ్గు చూపింది. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ, బోధన్ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. నిజామాబాద్ అర్బన్ అభ్యర్థి విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ టికెట్టు సుభాష్‌రెడ్డికి రాకపోవడంతో మనస్తాపం చెందిన నాగిరెడ్డిపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాకేష్ శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు యత్నించాడు. ఎల్లారెడ్డి గాంధీచౌక్‌లో ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ మండల అధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అఫీజ్ గాంధీచౌక్‌కు చేరుకుని రాకేష్ ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. సుభాష్‌రెడ్డికి టికెట్టు కేటాయించాలని కోరుతూ రాకేష్ గతంలో ఎల్లారెడ్డి నుంచి హైదరాబాద్‌లోని గాంధీభవన్ వరకు పాదయాత్ర చేశాడని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.



రాకేష్‌ను అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డి నియోజకవర్గం



అభ్యర్థి పేరు : కలకుంట్ల మదన్‌మోహన్‌రావు
పుట్టిన తేది : 01.08.1970
నివాసం : కామారెడ్డి
తల్లిదండ్రులు : వజ్రమ్మ, రాజేశ్వర్‌రావు
భార్య : ప్రీతి, **పిల్లలు** : కార్తీక్(కుమారుడు), తన్వీ(కూతురు)
విద్య : ఎమ్మెస్సీ (అగ్రికల్చర్)
వృత్తి : సాఫ్ట్‌వేర్ కంపెనీల నిర్వహణ
ప్రవృత్తి : సామాజిక సేవ

రాజకీయ నేపథ్యం:

- 2012లో టీడీపీలో చేరి, జహీరాబాద్ నియోజకవర్గంలో సైకిల్ యాత్ర ద్వారా గుర్తింపు పొందారు.
- 2018 లో కాంగ్రెస్‌లో చేరిక.
- 2019 లో జహీరాబాద్ పార్లమెంట్ స్థానంనుంచి బరిలో దిగి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు.
- పీసీసీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

నిజామాబాద్ రూరల్



అభ్యర్థి పేరు : రేకులపల్లి భూపతిరెడ్డి
పుట్టిన తేదీ: 12.02.1964
పుట్టిన గ్రామం: జలాల్‌పూర్, నిజామాబాద్ రూరల్ మండలం
తల్లిదండ్రులు: లక్ష్మీనర్సవ్వ, రాజారెడ్డి
భార్య: వినోదినిరెడ్డి, కుమారుడు, కూతురు
విద్య : ఎంబీబీఎస్(ఎంఎస్)
వృత్తి: సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్
రాజకీయ ప్రస్థానం: టీఆర్‌ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు

- 2009–14 వరకు బీఆర్‌ఎస్ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి.
- 2016 లో నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నిక.
- 2018 లో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో విభేదాలతో పార్టీ వీడి, కాంగ్రెస్‌లో చేరిక.
- 2018 లో నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ, ఓటమి.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



కామారెడ్డి టౌన్: మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లిం రచయితల సంఘం జాతీయ వేదిక ఆధ్వర్యంలో గత నెల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీల్లో కామారెడ్డి పట్టణానికి చెందిన లెక్చరర్ ఉమా శేషారావు విజేతగా నిలిచారు. ఆయనకు శుక్రవారం ప్రశంసా పత్రం,జ్ఞాపికను అందజేశారు.

వైభవంగా బోనాల పండుగ



గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని గౌరారంలో శుక్రవారం వైభవంగా గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. అన్ని కుల సంఘాల వారు ఐకమత్యంతో ఇంటికో బోనం చొప్పున భక్తి శ్రద్ధలతో సమర్పించారు.

29న అథ్లెటిక్స్ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని రాజారాం స్టేడియంలో ఈ నెల 29న అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా రూరల్ గేమ్స్ అసోసియేషన్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్, ఆర్గనైజర్లు బాలు, చందు, భూపతిరాజు తెలిపారు. జిల్లా స్థాయి కరాటే, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, బాస్కెట్‌బాల్, క్రికెట్, హ్యాండ్‌బాల్ పోటీల్లో బాలబాలికలను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా పాఠశాలల నుంచి నైపుణ్యం గల క్రీడాకారులను తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8919833851, 9014581059 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ఏడో బెటాలియన్ ఆవరణలో ఉన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం నిత్యహవనం, బలిహరణం, వసంతోత్సవం, డోలోత్సవం నిర్వహించారు. సాయంత్రం నిత్యహవనము, హారతి, తీర్థప్రసాద వితరణ, శ్రీలక్ష్మీదేవీకి సామూహిక కుంకుమార్చన, రాత్రి స్వామి వారికి గరుడవాహన సేవా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ రాంప్రకాశ్, విజయలక్ష్మీ దంపతులు, ఆలయ ధర్మకర్త శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ భూదానకర్త కుమారులు ప్రమోద్‌జాజు, భక్తులు పాల్గొన్నారు.

బాన్సువాడ గడ్డ.. శ్రీనివాసుల అడ్డా..!

- ఆరుసార్లు ప్రాతినిధ్యం వహించిన పోచారం
- మూడుసార్లు ఎం శ్రీనివాస్‌రావు, ఒకసారి బి శ్రీనివాస్‌రెడ్డి ఎన్నిక
- ప్రధాన పార్టీలను ఆదరిస్తున్న ఓటర్లు
- ఏడుసార్లు కాంగ్రెస్, ఆరుసార్లు టీడీపీ, మూడు సార్లు బీఆర్‌ఎస్ ప్రాతినిధ్యం
- స్పీకర్ చరిత్ర తిరగరాసేనా..?



కత్తెర గంగాధర్



బాజిరెడ్డి గోవర్ధన్



పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నియోజకవర్గ ఓటర్లు

పురుషులు:	1,00,608
మహిళలు:	92,225
ఇతరులు:	8
మొత్తం:	1,92,841

బాన్సువాడ నుంచి ప్రాతినిధ్యం వహించిన వారు

సంవత్సరం	అభ్యర్థి పేరు	పార్టీ
1952–57	లక్ష్మీబాయి	కాంగ్రెస్
1957–62	సీతాకుమారి	కాంగ్రెస్
1962–67	బి. శ్రీనివాస్‌రెడ్డి	కాంగ్రెస్
1967–72	ఎం. శ్రీనివాస్‌రావు	కాంగ్రెస్
1972–78	ఎం. శ్రీనివాస్‌రావు	కాంగ్రెస్
1978–83	ఎం. శ్రీనివాస్‌రావు	కాంగ్రెస్
1983–85	కిషన్ సింగ్	టీడీపీ
1985–89	ఎస్‌వీఎల్ నరసింహరావు	టీడీపీ
1989–94	కత్తెర గంగాధర్	టీడీపీ
1994–99	పోచారం శ్రీనివాస్‌రెడ్డి	టీడీపీ
1999–2004	పోచారం శ్రీనివాస్‌రెడ్డి	టీడీపీ
2004–2009	బాజిరెడ్డి గోవర్ధన్	కాంగ్రెస్
2009–2011	పోచారం శ్రీనివాస్‌రెడ్డి	టీడీపీ
2011–2014	పోచారం శ్రీనివాస్‌రెడ్డి	బీఆర్‌ఎస్
ఉప ఎన్నిక		
2014–2018	పోచారం శ్రీనివాస్‌రెడ్డి	బీఆర్‌ఎస్
2018–2023	పోచారం శ్రీనివాస్‌రెడ్డి	బీఆర్‌ఎస్



బాన్సువాడ: బాన్సువాడ నియోజకవర్గం శ్రీనివాసుల అడ్డాగా మారింది. ఇప్పటి వరకు 16 సార్లు ఎన్నికలు జరుగగా 10 సార్లు శ్రీనివాస్ అన్న పేరు గల వారు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1952లో ఏర్పడ నియోజకవర్గంలో ఇప్పటికీ ఓటర్లను ప్రభావితం చేసే అంశాలు ఎన్నో ఉన్నాయి. ఒకప్పుడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోటలా ఉండేది. తెలంగాణ ఉద్యమం తర్వాత 2011 నుంచి ఓటర్లు బీఆర్‌ఎస్ వైపు నిలవడంతో టీడీపీ కంచుకోటలో బీఆర్‌ఎస్ పాగా వేసినట్లయింది. కానీ టీడీపీ జోరుకు బ్రేకులు వేసింది మాత్రం కాంగ్రెస్సే. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 15 సాధారణ ఎన్నికలు, 2011లో ఒకసారి ఉప ఎన్నిక జరిగాయి. కాంగ్రెస్ ఏడు సార్లు, టీడీపీ ఆరు సార్లు, బీఆర్‌ఎస్ మూడు సార్లు విజయం సాధించాయి. బాన్సువాడలో ప్రస్తుత స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇక్కడి నుంచి పోటీ చేస్తుండడంతో ఇతర పార్టీలు కనుచూపుమేరల్లో కనిపించడం లేదు.

అత్యధిక విజయాలు..

1952లో ఏర్పడిన బాన్సువాడ నియోజకవర్గంలో మొదటిసారి నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మి బాయి గెలుపొందారు. 1957లో నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి సీతాకుమారి, 1962లో కాంగ్రెస్ నుంచి బి. శ్రీనివాస్‌రెడ్డి, 1967 నుంచి 1983 వరకు కాంగ్రెస్ నుంచి ఎం. శ్రీనివాస్‌రావు వరుసగా మూడు సార్లు విజయం సాధించి హ్యాట్రిక్ సాధించాడు. దిగంవత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ పార్టీ పెట్టాక నియోజకవర్గం టీడీపీకి పెట్టని కోటగా మారింది. 1983లో టీడీపీ పొత్తులో భాగంగా టికెట్ దక్కించుకున్న కిషన్ సింగ్ విజయం సాధించారు. 1985లో టీడీపీ నుంచి ఎస్‌వీఎల్ నర్సింహరావు, 1989లో టీడీపీ నుంచి కత్తెర గంగాధర్, 1994, 1999లో టీడీపీ నుంచి పోచారం శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందారు. 2004లో అనూహ్యంగా బాన్సువాడకు వచ్చిన బాజిరెడ్డి గోవర్ధన్(కాంగ్రెస్) వైపు ఓటర్లు నిలిచారు. 49,491 ఓట్ల మెజారిటీతో బాజిరెడ్డి గోవర్ధన్ విజయం సాధించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్‌కు అత్యంత సన్నితంగా ఉన్న బాజిరెడ్డి బాన్సువాడలో సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. 2009లో టీడీపీ నుంచి పోచారం, కాంగ్రెస్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్ మధ్య తీవ్ర పోటీ నెలకొనగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందారు. 2011లో తెలంగాణ ఉద్యమం ఉద్ధృతంగా కొనసాగుతున్నందున టీడీపీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన పోచారం ఉప ఎన్నికలకు వెళ్లారు. 2011లో జరిగిన ఉప ఎన్నికల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో పోచారం విజయం సాధించారు. తెలంగాణ ప్రభుత్వంలో పోచారం వ్యవసాయ శాఖ మంత్రిగా పని చేశారు. అప్పుడే రైతు బంధు, యంత్ర లక్ష్మి పథకాలు పురుడు పోసుకున్నాయి. 2018లో జరిగిన ఎన్నికల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజయం సాధించారు. వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్ సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పటి నుంచి స్పీకర్‌గా వ్యవహరించిన ఒక్కరు కూడా విజయం సాధించిన దాఖలు లేవు. కానీ ఈ సారి బాన్సువాడలో తాను చేసిన అభివృద్ధితో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చరిత్ర సృష్టిస్తామనే ధీమాలో ఉన్నారు.

ప్రభావం చూపే అంశాలు..

ఇప్పటి వరకు జరిగి ఎన్నికల్లో ప్రజా సమస్యలు, సామాజిక అంశాలు ఎంతగానో ప్రభావితం ముఖ్యంగా బోధన్–బీదర్ వయా బాన్సువాడ మీదుగా రైల్వేలైను ఏర్పాటు చేస్తామని ప్రతి ఎన్నికల్లో వాగ్దానాలు చేస్తు వస్తున్న ఇప్పటి వరకు ఈ సమస్య ప్రతిపాదనలకే పరిమతమైంది. రైల్వేలైను ఏర్పాటు చేస్తే ముఖ్యంగా పరిశ్రమలు అందుబాటులోకి వచ్చి నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో ఎక్కువగా నిరుద్యోగ సమస్య ఉత్పన్నమవుతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా 2018లో పోచారం శ్రీనివాస్‌రెడ్డి శాసనసభాపతిగా ఎన్నికైనప్పటి నుంచి అత్యధికంగా నిధుల వరద కొనసాగింది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 11 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు , రూ. 10 వేల కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పనులు కొనసాగాయి.

బాన్సువాడ నియోజకవర్గ స్వరూపం...

2018లో నాలుగు మండలాలు బాన్సువాడ, వర్ని, కొటగిరి, బీర్కూర్ ఉండేవి. ప్రస్తుతం బాన్సువాడ, బీర్కూర్, నస్రూల్లాబాద్, వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్, కోటగిరి, పొతంగల్ మండలాలు ఉన్నాయి. నియోజకవర్గంలో 258 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి.



బీబీఏతో మెరుగైన ఉపాధి అవకాశాలు

- కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర సింగ్



రాజేంద్రసింగ్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

కామారెడ్డి అర్బన్: బీబీఏ రిటైల్ వృత్తి విద్య కోర్సు చదివే విద్యార్థులకు వారంలో మూడు రోజులు చదువు, మూడు రోజుల సంపాదన ఉంటుందని, కామారెడ్డి ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల విద్య రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర సింగ్ అన్నారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీబీఏ కోర్సు చదివే విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించగా రాజేంద్ర సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యాపార రంగం బహుముఖాలుగా విస్తరిస్తున్నందున విద్యార్థులు త్వరగా ఉపాధి కల్పించే కోర్సులు చేయడం ఉత్తమమన్నారు. వినియోగదారులకు సేవలు అందించే రిటైలింగ్, లాజిస్టిక్స్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్, టూరిజం మేనేజ్‌మెంట్ వంటి కోర్సుల్లో వెంటనే ఉపాధి లభిస్తుందని, ఉద్యోగంతో పాటు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగే అవకాశాలుంటాయని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, అకడమిక్ సమన్వయకర్త వి.శంకర్, బీబీఏ సమన్వయకర్త జె.శివకుమార్, బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న రాజేంద్రసింగ్

కామారెడ్డి టౌన్: వ్యవసాయ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని భవిష్యత్తులో ఉత్తమ స్థానంలో ఉద్యోగాలు సాధించాలని రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేంద్ర సింగ్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్కే డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుపై సెమినార్ నిర్వహించారు. మూడు సంవత్సరాల అగ్రికల్చర్ కోర్సు ఎంతో విశిష్టమైనదన్నారు. కార్యక్రమంలో కళాశాల సీఈవో జైపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలి

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్



బీబీపేటలో మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధి

బీబీపేట: మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీపీ బాలామణి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సందర్భంగా మండల ప్రజా ప్రతినిధులు ఆర్టీసీ సంస్థపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు రాకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతోందని, బస్సుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని పట్టు బట్టారు. ప్రతి గ్రామానికి బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌కు గతంలో వినతి పత్రాలిచ్చినా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. అలాగే పలు సమస్యలపై చర్చించారు. సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్ రెడ్డి, ఎంపీడీవో పూర్ణ చంద్రోదయ కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మల దహనం



జిల్లా కేంద్రంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరాచౌక్ వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతుబంధు విషయంలో కాంగ్రెస్‌పై బీఆర్‌ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ విమర్శించారు. నవంబర్ 3 లోపల రైతులకు రైతు బంధు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్ వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ వక్రీకరించి రైతు బంధు రద్దు చేయాలని కాంగ్రెస్ చూస్తుందని తప్పుడు ప్రచారం చేయడాన్ని ఖండించారు. నాయకులు కారంగుల అశోక్‌రెడ్డి, పాక జ్ఞానేశ్వరి, గుడుగుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట: బీఆర్‌ఎస్ చేపట్టిన కాంగ్రెస్ దిష్టిబొమ్మల దహన కార్యక్రమాన్ని నిరసిస్తూ శుక్రవారం రాజంపేట మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు . రైతు బంధు పథకం విషయంలో బీఆర్‌ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యాదవ రెడ్డి, నాయకులు వీరన్న, బాలకిషన్, యూత్ అధ్యక్షుడు అంకం కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.



రాజంపేటలో..



కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ యాదగిరి

డిచ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ యాదగిరి సూచించారు. మండలంలోని రాంపూర్ సొసైటీ ఆధ్వర్యంలో మల్లాపూర్, తిర్మన్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. డీఎస్‌వో చంద్రశేఖర్, డీసీవో సింహాచలం, సివిల్‌సప్లై డీఎం జగదీశ్‌తో కలిసి రైతులతో మాట్లాడారు. వడ్ల తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పించాలని సొసైటీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో నాగరాజు, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి



కాలూర్‌లో పంట దిగుబడిని పరిశీలిస్తున్న అధికారులు

నిజామాబాద్ రూరల్: పంట కోత సమయంలో రైతులు పలు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. రూరల్ మండలంలోని కాలూర్ గ్రామంలో వరి పంటను శుక్రవారం పరిశీలించారు. ఒక్క ఎకరంలో వరి పంట దిగుబడి తెలుసుకోవాలంటే 25 చదరపు మీటర్ల పొలంలో వరి పంటను కోసి తూకం వేస్తే వచ్చే ధాన్యం కిలోల ఆధారంగా పంట దిగుబడి తెలుసుకోవచ్చన్నారు. కోత దశలో దోమ పోటు, ఉశ, తాలు, తప్ప, ఎరుపు గింజలు రంగు మారడం వంటి రోగాలు కనిపిస్తే మండల వ్యవసాయ అధికారి సూచనలతో తగిన మందులను పిచికారీ చేయాలన్నారు. రైతులు సహకార సంఘల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించాలని కోరారు. ఆయన వెంట ఏడీఏ ప్రదీప్, మండల వ్యవసాయ అధికారిణి హీరాజాదవ్, ఏఈవోలు స్వాతిలత, రమాకాంత్, ఏఎస్‌వో దీపిక, డీవైఎస్‌వో గంగాధర్, రైతులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు..



జుక్కల్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంలోని చౌరస్తాలో శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేశారు. రైతు బంధు, రైతు బీమా డబ్బులు ఆపివేయాలని ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేయడం పట్ల బీఆర్‌ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమానికి అడ్డు తగులుతున్న కాంగ్రెస్ పార్టీని ఎన్నికల్లో బొందపెడుతామన్నారు. నాయకులు నీలుపటేల్, సాయాగౌడ్, శివానంద్‌పటేల్, తదితరులున్నారు.

భిక్కనూరులో..

భిక్కనూరు: పథకాలను నిలిపివేయాలని రేవంత్‌రెడ్డి ఎన్నికల కమిషన్‌ను కోరడాన్ని నిరసిస్తూ భిక్కనూరు మండలం అంతంపల్లి, కాచాపూర్ గ్రామాల్లో ఆయన దిష్టిబొమ్మలను శుక్రవారం దహనం చేశారు. మాజీ ఎంపీపీ తొగరి సుదర్శన్, సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గాంధారి: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలాల ఉన్నాయి. గ్రామానికి చెందిన సతీశ్, బూక్య శివ ప్రధాన రహదారిపై ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో కింద పడ్డ ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కామారెడ్డికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

గాంధారి: చద్మల్ తండాకు చెందిన కేతావత్ సునీత(35) చికిత్స పొందుతు గురువారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సునీత కడుపు నొప్పి భరించలేక ఈ నెల 25న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా గురువారం రాత్రి చికిత్స పొందుతు మృతి చెందింది. మృతురాలి భర్త వసంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వివాహితపై అత్యాచారం

పెద్దకొడప్‌గల్: వివాహితపై ఒకరు అత్యాచారం చేసిన ఘటన మండలంలోని పోచారం తండాలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం తండాకు చెందిన ఓ వివాహిత ఇంటికి కేమ్రాజ్ కల్లాలికి చెందిన తెలిసిన వ్యక్తి సాతే సింగ్ తరచూ వస్తుండేవాడు. అదే క్రమంలో గురువారం రాత్రి వచ్చిన సదరు వ్యక్తి ఆమె ఇంటి ఎదుట నిద్రించాడు. శుక్రవారం ఉదయం 4 గంటల సమయంలో వివాహిత కాలకృత్యాల నిమిత్తం ఇంటి వెనుకాల ఉన్న బాత్రూంకు వెళ్లగా అదే సమయంలో సాతేసింగ్ వెనుకాల నుంచి బాత్రూంలోకి వెళ్లి ఆమెపై అత్యాచారం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రూ.9.25 లక్షల నగదు స్వాధీనం



బాన్సువాడ రూరల్: వాహనాల తనిఖీలో భాగంగా తాడ్కోల్ చౌరస్తాలో కారు నుంచి ఒకరి వద్ద రూ.9.25 లక్షల నగదు లభించినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. నసురుల్లాబాద్ మండలం అంకోల్‌క్యాంపునకు చెందిన మణిపృథ్వీ అనే సిమెంట్ షాపు నిర్వాహకుడి నుంచి ఈ నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఉన్నతాధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

వ్యభిచార కేంద్రాలపై పోలీసుల దాడి

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని మూడు చోట్ల వ్యభిచార గృహాలపై దాడి నిర్వహించినట్లు సీఐలు అజయ్, అంజయ్య తెలిపారు. స్థానికుల ముందస్తు సమాచారం నిమిత్తం ఏక కాలంలో వ్యభిచార గృహాలపై దాడులు నిర్వహించగా నిర్వాహకులతో పాటు ఐదుగురు విటులు, పది మంది బాధిత మహిళలను అరెస్టు చేసి పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సరిహద్దులో పక్కా నిఘా పెట్టాలి



కందకుర్తి చెక్‌పోస్టును పరిశీలిస్తున్న సీపీ

బోధన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో పక్కా నిఘా పెట్టాలని సీపీ కల్మేశ్వర్ అధికారులను ఆదేశించారు. అక్రమంగా డబ్బు, మద్యం రవాణ జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహారాష్ట్ర సరిహద్దులోని సాలూర మండల కేంద్రం శివారులో ఉన్న చెక్‌పోస్టు, బోధన్ మండలంలోని ఖండ్‌గాం చెక్‌పోస్టులను సీపీ, ఏసీపీ కిరణ్‌కుమార్‌లతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. సాలూర అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుకు కిలో మీటర్ల దూరంలో ఉన్న మహారాష్ట్ర ప్రాంత చెక్ పోస్టును సీపీ సందర్శించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిని ఉపేక్షించకూడదని పేర్కొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

రెంజల్: అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీపీ కల్మేశ్వర్ సూచించారు. మండలంలోని కందకుర్తి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టును శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. డబ్బు, మద్యం అక్రమ రవాణాను నియంత్రించేందుకు జిల్లాలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు పని చేస్తున్నాయని పేర్కొన్నారు. అవసరమైతే కేంద్ర బలగాలతో చెక్‌పోస్టులను పటిష్టం చేస్తామన్నారు. సీపీ వెంట ఏసీపీ కిరణ్‌కుమార్, రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్, రెంజల్ ఎస్సై ఉదయ్ కుమార్ ఉన్నారు.